సాక్షి ఒడిశా
మంగళవారం । 23 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,79,144
బంగారం	420 మిల్లీ గ్రాములు
వెండి	44 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వీడని వాన

జయపురం సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.

- 8లో

యువకుడి ఆత్మహత్య



రాయగడ ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

బీజేడీ మీడియా సెల్ ఏర్పాటు

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రతిపక్ష బిజూ జనతా దళ్ మీడియా సెల్ ఏర్పాటు చేసింది. దీనిలో 16 మంది సభ్యులను నియమించారు. వీరిలో ప్రశాంత్ ముదులి, బ్యోమకేష రాయ్, సుభాస్ సింగ్, రమేష్ బెహెరా, మన్మథ్ రౌత్రాయ్, తుంబనాథ్ పండా, గౌతంబుద్ధ దాస్, శారదా జెనా, లతికా ప్రధాన్, మిహిర్ రాయ్, చిన్మయ్ సాహు, ఈప్సితా సాహు, సోఫియా ఆలం, ఇరానీ రే, విశ్వప్రతాప్ సాహు మరియు అరుణ్ శ్రీచందన్ ఉన్నారు.

ఏకామ్ర క్షేత్రం సందర్శన



లింగరాజు దేవస్థానంలో గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: పవిత్ర శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ఏకామ్ర క్షేత్రం సందర్శించి లింగరాజును దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజల క్షేమం కోసం మహాదేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

అభాగ్యుడిని ఆదుకున్న డ్రైవర్లు



అభాగ్యుడితో తెంతులకుంటి డ్రైవర్లు

కొరాపుట్: రోడ్డు మీద అచేతనంగా పడి ఉన్న అభాగ్యుడిని ప్రైవేటు డ్రైవర్లు ఆదుకున్నారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి కేంద్రంలో ఒక అభాగ్యుడిని డ్రైవర్లు గుర్తించారు. అతడిని పరిశీలించగా తీవ్రమైన జ్వరంతో సొమ్మసిల్లి ఉన్నాడు. వెంటనే వారు చేరదీసి మంచి వస్త్రాలు వేశారు. ఆహారం ఇచ్చి మందులు వేశారు. ఈ విషయం జిల్లా సామాజిక భద్రతా అధికారి సుదాంశు పాత్రోకి తెలియజేశారు. వెంటనే సుదాంశు ఆ బాధితుడిని నబరంగ్‌పూర్‌లోని సంరక్షణ కేంద్రానికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి కుదుటపడిన తర్వాత కుటుంబానికి సమాచారం ఇస్తామని ప్రకటించారు.


గొలుసు దొంగలు అరెస్టు



దొంగ సొత్తుతో పట్టుబడిన నిందితులు

భువనేశ్వర్: నగర పరిసర వీధుల్లో గొలుసు దొంగల బెడద తీవ్రమైంది. మార్నింగ్ వాక్ చేసేవారిని గురిపెట్టి ఈ ముఠా దొంగతనాలకు పాల్పడుతోంది. ప్రధానంగా బంగారు గొలుసులను దోచుకుంటున్నారు. ఈ ముఠాకు చెందిన దుండగులను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో వీరు వినియోగించే మారణాయుధాలు, 26 గ్రాముల 4 బంగారు గొలుసులను స్వాధీనపరచుకున్నారు. భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్ ప్రాంతాల్లో వీరి ముఠా పనిచేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

వ్యక్తి అనుమానాస్పద మృతి



అడవిలో లభించిన ప్రధాన్ మృతదేహం

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి సార అంబొదల రహదారి సమీపంలోని అడవుల్లో ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కెందుగుడ సమీపంలోని నందరాంపూర్ గ్రామానికి చెందిన నహసన్ ప్రధాన్ (60)గా గుర్తించారు. అటువైపుగా వెళ్తున్న కొంతమంది వ్యక్తులు పొదల్లో పడి ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి క్లూస్ టీమ్‌తో చేరుకున్న పోలీసులు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం మోటార్ సైకిల్‌పై ఏదో పనిమీద వెళ్లిన ప్రధాన్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం సాయంత్రం పోలీసులకు ఒక గుర్తు తెలియని మృతదేహం అడవిలో ఉన్నట్లు సమాచారం అందించడంతో సైంటిఫిక్ బృందంతో అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అయితే నహసన్‌ను ఎవరో హత్యచేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.



అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు



ప్రసంగిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్

సభా సమరం

- గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ఆరంభం
- సభను బహిష్కరించిన విపక్షాలు
- గవర్నర్ కొడుకుని అరెస్టు చేయాలని డిమాండ్
- విచారణకు ఆదేశాలు జారీ

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సభలో అధికార, విపక్ష స్థానాల్లో సభ్యులంతా ఆసీనులయ్యారు. బీజేపీ అధికార హోదాతో, బీజేడీ విపక్ష బలంతో సభకు కొత్త శోభని రంగరించారు. రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ప్రసంగంతో సభా సమావేశాలు ఆరంభమయ్యాయి. ఒడియా ఆత్మ గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతి భద్రతలు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పని చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అందరికీ విజ్ఞప్తి చేశారు.

గవర్నర్ ప్రసంగం

ఈ సందర్భంగా గవర్నర్ రఘుబర్ దాస్ ప్రసంగిస్తూ ఒడిశాలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం పారదర్శకతతో 1.5 లక్షల ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతుందన్నారు. వచ్చే రెండేళ్లలో 65,000 ఉద్యోగాలు భర్తీ చేయబడతాయని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కొత్త క్రీడా విధానం ప్రారంభం కానుందన్నారు. జాతీయ పార్కులు, అభయారణ్యాలపై వన్యప్రాణుల ఔత్సాహికులను ఆకర్షించడం మరియు పరిరక్షణను ప్రోత్సహించేందుకు వన్యప్రాణి పర్యాటక సర్క్యూట్ సష్టించబడుతుందని వెల్లడించారు. సాగరతీర పర్యటన మెరుగుదలకు ప్రభుత్వం అన్ని బీచ్‌లను కలుపుతూ కోస్తా సర్క్యూట్ ఏర్పాటు చేస్తుందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారు. సుస్థిర పర్యాటకం ద్వారా స్థానిక గిరిజన సంఘాలకు సాధికారత కల్పిస్తూ, సాంస్కృతిక మార్పిడి మరియు ఆర్థికాభివృద్ధి ప్రోత్సాహానికి గ్రామాల్లో ఎకో-టూరిస్ట్ హబ్‌లు మరియు హోమ్‌స్టే సౌకర్యం అందుబాటులోకి రానుందని వెల్లడించారు. 9వ తరగతి నుంచి కెరీర్ కౌన్సెలింగ్‌ను సులభతరం చేసేందుకు పాఠశాలల్లో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారని ప్రసంగించారు.

విపక్షాల వాకౌట్

రాజ్‌భవన్ సిబ్బందిపై గవర్నర్ కుమారుడు దాడి చేయడం, పోలీసులు నిష్క్రియాత్మకంగా వ్యవహరించడంపై రాష్ట్ర శాసన సభలో గవర్నర్ ప్రసంగాన్ని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు బహిష్కరించారు. తొలిరోజు సభలో గవర్నర్ ప్రసంగాన్ని బీజేడీ ఎమ్మెల్యేలు బహిష్కరించడానికి గల కారణాలపై ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతిన్నట్లు కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈ కారణంగానే సమావేశాలు ప్రారంభంలోనే తమ పార్టీ సభ్యులు శాసనసభ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. గవర్నర్ కుమారుడు ప్రభుత్వ అధికారిపై దాడికి పాల్పడినా ఎటువంటి చర్య తీసుకోలేదని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తాము ప్రభుత్వంలో ఉన్నప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ ప్రభుత్వాధికారులు చట్టాన్ని ఉల్లంఘిస్తే వెంటనే చర్యలు తీసుకోవడం జరిగేదని గుర్తు చేశారు.

ఒడియా ఆత్మ గౌరవం ఇదేనా...

గవర్నర్ హిందీలో ప్రసంగిస్తుండగా ఒడియా భాష రాష్ట్ర ఆత్మ గౌరవం కాపాడుతామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, గద్దెనెక్కడంతో ఈ విషయాన్ని విస్మరించిందని కాంగ్రెస్ నాయకుడు తారా ప్రసాద్ బాహిణీపతి ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలు ఆరంభం పురస్కరించుకుని గవర్నర్ హిందీలో ప్రసంగించడం ఈ విస్మరణకు నిలువెత్తు తార్కాణంగా పేర్కొన్నారు. ఆయన కొడుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిని కొట్టాడు. కానీ అతనిపై కేసు పెట్టలేదని మండిపడ్డారు. గవర్నర్ కుమారుడిని అరెస్ట్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. రాజ్‌భవన్ సిబ్బందిపై గవర్నర్ కుమారుడు దాడి చేయడంపై న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మాట్లాడుతూ.. సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని పూరీ కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. పూరీ కలెక్టర్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.



దివంగతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న సభ్యులు

దివంగతులకు శ్రద్ధాంజలి

ఇటీవల మృతి చెందిన రాష్ట్ర మాజీ గవర్నర్ మురళీధర చంద్రకాంత బండారే, మాజీ డిప్యూటీ స్పీకర్ సురేంద్ర నాథ్ నాయక్, మాజీ మంత్రులు దామోదర్ రౌత్, డంబురుధర ఉలాకా, కమలా దాస్, వి.సుజ్ఞాన కుమారి దేవ్, మాజీ శాసనసభ సభ్యుడు ఆదిత్య మాఢి, ప్రముఖ సంఘ సంస్కర్త పద్మశ్రీ కమలా పూజారి, ఒడిశా పోలీసు మాజీ కానిస్టేబుల్ హిమాంశు శేఖర రథ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సభలో సభ్యులంతా కాసేపు మౌనం ప్రదర్శించి సంతాపం ప్రకటించారు.

ఆంధ్రా-ఒడిశా సమస్యలు పరిష్కరించాలి

- జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి



ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి


జయపురం: కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఆంధ్రా-ఒడిశా సమస్యలు పరిష్కరించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన పలు సమస్యలపై స్పందించారు. కేంద్రం, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం, ఒడిశా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, అందువలన ఎంతోకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు మంత్రులు సమావేశం కావాలని సూచించారు. కొటియా, మహానది, పోలవరం లాంటి పలు సమస్యలు ఉన్నాయన్నారు. ఒడిశాలో పెరుగుతున్న నిరుద్యోగం, వలస కార్మికులతో పాటు ఇతర సమస్యలపై విధానసభలో కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని వెల్లడించారు. అలాగే జయపురంలో పెరుగుతున్న నేరాలపై తీవ్రంగా స్పందించారు. నేరస్తులు, కొంతమంది పోలీసులకు మధ్య లావాదేవీలు ఉన్నట్లు తెలుస్తోందని అభిప్రాయపడ్డారు. పెద్ద పెద్ద నేరగాళ్లు బెయిలుపై బయట ఉంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తాను ఎస్పీతోను, జయపురం పోలీసు అధికారులతోను చర్చించానని పేర్కొన్నారు. జయపురం, బొరిగుమ్మ, తదితర ప్రాంతాల్లో నేరస్తులపై కఠిన చర్యలు చేపట్టి శాంతి భద్రతలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర మత్స్య వ్యవసాయంపై శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మత్స్య విభాగ అధికారి సింహాచల పాఢి

జయపురం: స్థానిక పూల్‌బెడలోని ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ పరిశోధన సభాగృహంలో సమగ్ర మత్స్య వ్యవసాయంపై రైతులకు శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో బొయిపరిగుడ సమితి నుంచి 70 మందికి పైగా మత్స్య రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మత్స్య విభాగ అధికారి సింహాచల పాఢి మాట్లాడుతూ.. రైతులు ఏవిధంగా మత్స్య వ్యవసాయం చేస్తే అధిక లాభాలు పొందగలరో వివరించారు. చెరువులు ఏర్పాటు చేయడంతో పాటు చేప విత్తనాలు వేసేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. చెరువు గట్టుపై సేంద్రీయ పద్ధతిలో కాయగూరలు పండిస్తే రైతులు మరింత లాభాలు పొందవచ్చన్నారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ జయపురం విభాగ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పారిడ మాట్లాడుతూ మత్స్య వ్యవసాయంపై రైతులకు పరిపూర్ణ అవగాహన కలిగించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు.



బాధ్యతల స్వీకరణ

నూతన అడ్వకేట్ జనరల్‌గా పీతాంబర ఆచార్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్ రఘుబర దాస్ ఆమోదం మేరకు ఆయన ఇటీవల ఈ హోదాకు నియమితులయ్యారు. ఆయన ఇదివరకు ఒడిశా హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పేరొందారు.

– భువనేశ్వర్

కో-ఆర్డినేటర్లను నియమించాలని ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

రాయగడ: మున్సిపాలిటీ పరిధి 24 వార్డుల్లో కో-ఆర్డినేటర్లను నియమించాలని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతీ వార్డుకు ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించేందుకు సన్నాహాలు చేసిందని, దీనిలో భాగంగా ఒక్కరోజు శిక్షణ సైతం ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇంతవరకు తదుపరి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా కొలువైన బీజేపీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని కో-ఆర్డినేటర్ల నియామకంపై ఆలోచన చేయాలని కోరారు. అనంతరం ఒక వినతిపత్రం మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సౌమ్య రంజన్‌కు అందజేశారు.

కొండచిలువ కలకలం



మేకను మింగిన కొండచిలువ



గోనెసంచిలో అటవీ ప్రాంతానికి తరలిస్తున్న అటవీ సిబ్బంది

భువనేశ్వర్: గంజాం జిల్లా ఖల్లికోట మండలం శ్యాంసుందర్‌పూర్ గ్రామ సమీపంలో ఒక భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. ఒక మేకను పట్టుకొని మింగేసింది. ఈ భయానక సంఘటనపై గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలియడంతో బరంపురం అటవీ మండలం ఖల్లికోట అటవీ శాఖ సిబ్బంది మరియు స్నేక్ హెల్ప్ లైన్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆచితూచి చర్యలు చేపట్టారు. మేకను మింగిన కొండచిలువ 12 అడుగుల పొడవు ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి హాని కలగకుండా కదిలే పరిస్థితిలో లేని కొండచిలువని పట్టుకొని కులాఖోల్ అడవుల్లో సురక్షితంగా విడిచిపెట్టారు.

శివనామ స్మరణలో..!

- రాష్ట్రంలో ప్రారంభమైన కావడి యాత్రలు
- ఆగస్టు 19 వరకు కొనసాగనున్న దీక్షలు
- నిష్ఠతో మహా దేవుడికి పూజలు



రాయగడ: శైవక్షేత్రానికి కావిళ్లతో వెళ్తున్న భక్తులు

భువనేశ్వర్: పవిత్ర శ్రావణ మాసం పురస్కరించుకుని రాష్ట్రంలో కావడి యాత్ర దీక్ష ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ మాసాన్ని సావన్ అని కూడా వ్యవహరిస్తారు. ప్రతీ సంవత్సరం జూలై మరియు ఆగస్టు నెలల మధ్య ఈ దీక్ష చేపడతారు. ఈ పవిత్ర కాలంలో శివుని భక్తులు కావడి యాత్రలో పాల్గొంటారు. పవిత్ర నదీ తీరాల నుంచి ఈ యాత్ర ప్రారంభిస్తారు. ఈ నదుల్లో జలం కలశాల్లో సేకరించి కావడికి బిగించి భుజాన వేసుకుని శైవ క్షేత్రానికి బయల్దేరుతారు. యాత్ర ఆరంభం అయితే కావడి నేల మోపకుండా గమ్యం చేరుతారు. మనో సంకల్పం మేరకు నదీ తీరం, శైవ క్షేత్రం నిర్ధారించుకుంటారు. మార్గమధ్యలో మల మూత్ర విసర్జన పరిస్థితుల్లో శుచి, శుభ్రత నియమాలు కట్టుదిట్టంగా ఆచరిస్తారు. ఈ పరిస్థితుల్లో కావడి నేలకు ఆనకుండా రీతిలో శైవ క్షేత్రాలకు అనుసంధానపరిచే ప్రాంతాల్లో కావడి స్టాండ్లు ఏర్పాటు చేస్తారు. పలు స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక, ఆధ్యాత్మిక వర్గాలు ఈ సౌకర్యం కల్పిస్తారు.

మహా దేవుడికి అభిషేకం

సంకల్పం మేరకు గమ్యం చేరి మహా దేవునికి కావడి నదీ జలంతో అభిషేకించడంతో మనో వాంఛ సిద్ధిస్తుందని నమ్మకం. దీక్షకుల శక్తి మేర యాత్ర శైలి నిర్ధారించుకుంటారు. సాధారణంగా కాషాయం, పసుపు రంగు దుస్తులు ధరిస్తారు. కాలికి చెప్పులు లేకుండా కొనసాగించే యాత్రలో దారి పొడవునా బోల్ భమ్ శివనామ స్మరణతో పరిసరాల్లో శివమయ వాతావరణం ఆవిష్కరిస్తారు. దీక్ష కాలంలో మాంసాహారం, మద్యం మరియు ఇతర భోగాలకు దూరంగా ఉంటు సాత్విక దిన చర్యగా అలవరచుకుంటారు. కొంతమంది భక్తులు ఈ మాసంలో జుట్టు మరియు గోర్లు కత్తిరించుకోకుండా క్షర కర్మలు నివారిస్తారు. ఈ సంవత్సరం జూలై 22 నుంచి ప్రారంభమైన కావడి యాత్ర ఆగస్టు 19 వరకు కొనసాగుతుంది. దీనిని 29 రోజులు పాటిస్తారు. సోమవారాల్లో ఉపవాసంతో శివునికి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. జూలై 22, జూలై 29, ఆగస్టు 5, ఆగస్టు 12 మరియు ఆగస్టు 15 తేదీల్లో శ్రావణ సోమవారాలు జరుపుకుంటారు. రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాలు ప్రత్యేకించి కటక్‌లోని ధవలేశ్వర్ ఆలయం, ఢెంకనాల్‌లోని కపిలాష్ ఆలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ్ ఆలయం మరియు భద్రక్‌లోని అఖండలమణి ఆలయాలకు భక్తుల తాకిడి పెరుగుతుంది. ఇతర శివాలయాలు కూడా కావడి యాత్రికులతో కిటకిటలాడతాయి.



భువనేశ్వర్: భద్రక్‌లోని అఖండల మణీశ్వరుడు

రాయగడలో...

ఒడియా ప్రజల శ్రావణ మాసం ప్రారంభం కావడంతో బోల్‌భం భక్తులు దీక్షలను చేపట్టారు. మొదటి సోమవారం కావడంతో శైవక్షేత్రాల్లో భక్తుల సందడి కనిపించింది. ఈ ఏడాది పట్టణంలో రెండు వేలమందికి పైగా భక్తులు ఈ దీక్షలు చేపట్టే అవకాశం ఉంది.



భువనేశ్వర్: నదీతీరాల్లో కావడి దీక్ష పూజాద్రవ్యాలతో పూజలు



భువనేశ్వర్: నేలకు తాకకుండా స్టాండులకు అమర్చిన దీక్ష కావళ్లు



భువనేశ్వర్: కావడి పాదయాత్రలో శివ భక్తులు

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


సుప్రీత్ నాయక్ (ఫైల్)

రాయగడ: స్థానిక ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఐఐసీ కేకేబీకే కుహరో, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌కే నగర్ మెయిన్ రోడ్డు వద్ద వ్యాపారం చేస్తున్న సుప్రీత్ నాయక్ (22) ఎప్పటిలాగే రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి బయటే భోజనం చేశానని, మరి తిననని చెప్పి తన గదిలోకి వెళ్లి లోపల గడియ పెట్టుకున్నాడు. అదే గదిలో సుప్రీత్‌తో పాటు అతని సోదరుడు కూడా పడుకుంటాడు. అతను భోజనం చేసిన అనంతరం అదే గదిలో నిద్రించేందుకు తలుపులు తట్టాడు. అయితే ఎంత తట్టినా లోపల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో కుటుంబ సభ్యులంతా ఆందోళన చెంది తలుపులు విరగ్గొట్టారు. అనంతరం లోపలికి వెళ్లి చూసేసరికి ఉరివేసుకుని విగతజీవిగా ఉన్న సుప్రీత్‌ను చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

తీవ్రంగా గాయపడినవారికి ప్రభుత్వ సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి అటల్‌గుడ గ్రామంలో ఇటీవల ఒక వంట ఇల్లు కూలిపోవడంతో తల్లితో పాటు ఇద్దరు కూతుర్లు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందిన ఆ ముగ్గురికి అధికారులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. బాధితుల ఇంటికి వెళ్లి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ చౌదరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిత్తరంజన్ భొత్ర, బీడీవో భాస్కర చంద్ర పాత్రో, సమితి సామాజిక సురక్ష అధికారి కార్తీక చంద్ర పాఢీ తదితరులు పాల్గొన్నారు.

కలప దుంగలు స్వాధీనం


కలప దుంగలతో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి సమితి పరిధి లెల్లిగుమ్మ సంరక్షిత అడవుల నుంచి విలువైన కలప దుంగలను పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టికిరి అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి 61 కలప దుంగలతో పాటు రవాణాకు వినియోగించే పికప్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. టికిరి అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ అనిల్ పాణిగ్రాహి తెలిపిన వివరాల ప్రకారం లెల్లిగుమ్మ సంరక్షిత అడవుల నుంచి కొందరు కలప దుంగలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మొబైల్ స్క్వాడ్ దాడులు నిర్వహించింది. ఈ క్రమంలో బొడొమఝ్రిభట్ట వద్ద కాపాల కాశారు. అదే రహదారి మీదుగా ఒక పికప్ వ్యాన్ వెళ్తుండడం గమనించి దానిని ఆపి తనిఖీ చేయగా విలువైన 61 కలప దుంగలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని అంచనా వేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడిన బొడొమఝ్రిభొట్ట గ్రామానికి చెందిన సునీల్ టర్కా, గోపాల్ నాయక్‌లను అరెస్టు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ ఆర్‌ఎస్ రైల్వే గేటు సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోమవారం ఉదయం నౌపడ గేటు సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మృతుడిని టెక్కలి గొల్లవీధికి చెందిన పూస పెంటయ్య(52)గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


పూణేలో వలస కార్మికుడు మృతి


మామిడి కృష్ణారావు(ఫైల్)

కవిటి: మండలంలోని బెలగాం పంచాయితీ రాపాకపుట్టుగకు చెందిన మామిడి కృష్ణారావు(45) అనే వలసకార్మికుడు మహారాష్ట్రలోని పూణేలో అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులకు సోమవారం సమాచారం అందింది. తన విధుల్లో భాగంగా డ్యూటీకి వెళ్లే క్రమంలో బీపీ ఒక్కసారిగా అధికం కావడంతో కుప్పకూలాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గ్రామానికి సమాచారం వచ్చిందని తెలిపారు.


మల్కన్‌గిరి: టేక్‌బేడ వద్ద రహదారిపై పడిన కొండ చరియలు


జయపురం: వరద నీటిలో పంట పొలాలు


జయపురం: మాచ్‌ఖండ్ జలాశయం నుంచి బయటకు వస్తున్న నీరు

వీడని వాన


జయపురం: చెరువుకు గండిపడిన దృశ్యం


జయపురం: జోరుగా పారుతున్న శబరి నది


మల్కన్‌గిరి: చెట్టును కోస్తున్న అగ్నిమాపక సిబ్బంది


జయపురం: నీట మునిగిన పంట పొలాలు


మల్కన్‌గిరి: మోటు వద్ద పొంగి ప్రవహిస్తున్న శబరి నది

- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ వద్దనున్న శబరి నదిలో నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. దీంతో ప్రజలు, భోల్‌భం యాత్రికులు నదీతీర ప్రాంతానికి వెళ్లవద్దని బీడీవో భాస్కర్ చంద్ర సాహు హెచ్చరికలు జారీ చేశారు. అలాగే కుండపోత వర్షాలు వలన దసమంతపూర్ గ్రామ పంచాయతీలోని పంట పొలాలు నీటమునిగాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. జయపురం సబ్ డివిజన్‌లో గత మూడు రోజుల్లో 162 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో కొలాబ్ ప్రాజెక్టు, తెలంగిరి ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. అలాగే మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టులో ఒక గేటు తెరిచినట్లు తెలుస్తోంది.

వరద బీభత్సం

మల్కన్‌గిరి: జిల్లాలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మల్కన్‌గిరి నుంచి మోటు వెళ్లే 326వ నంబర్ జాతీయ రహదారి బంద్ అయ్యింది. పొట్టేరు వద్ద వంతెన పూర్తిగా కూలిపోయింది. మోటు వద్ద శబరి నదిలో 21 మంది చిక్కుకుపోవడంతో ఓడ్రాఫ్ బృందం సాయంతో ఒడ్డుకు చేర్చారు. కలిమెల సమితి, మల్కన్‌గిరి టౌన్లలో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మత్తిలి సమితి మడ్కపోదర్ పంచాయతీ కోరపల్లి గ్రామం వద్ద ఒక భారీ చెట్టు పడిపోవడంతో సలీమ్, క్యాంగ్, టీమురుపల్లి, కర్తన్‌పల్లి, కుమార్‌పల్లి మోహిపోదర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కలిమెల సమితి టేక్‌బేడ గ్రామం వద్ద కొండ చరియలు పడి రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.


మల్కన్‌గిరి: వరద బాధితులకు భోజనాలు అందజేస్తున్న దృశ్యం


మల్కన్‌గిరిలోని పునరావాస కేంద్రంలో మహిళలు


మల్కన్‌గిరి: పొట్టేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

సీఎల్పీ సమావేశానికి పిలవలేదు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని అసెంబ్లీ ఆవరణలో పలుమార్లు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రకటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈరోజు జరిగిన సీఎల్పీ సమావేశానికి తనని పిలవలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ సమావేశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అసలు సమావేశం జరిగిందా అని మీడియా ప్రతినిధులను తిరిగి ప్రశ్నించారు. సమావేశం జరిగిందనే విషయం తనకు తెలియదన్నారు. రాజ్యసభలో బీజేపీకి బలం లేదన్నారు. కానీ బీజేడీకి 9 మంది ఉండడంతో బీజేపీ పెద్దలు నవీన్ వద్ద మోకరిల్లుతున్నారని పేర్కొన్నారు. ప్రతీసారి ముఖ్యమంత్రి స్వయంగా ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ వద్దకు వెళ్లి దండాలు పెడుతున్నారన్నారు. బీజేపీ పెద్దలు ముఖ్యమంత్రిని నవీన్ వద్దకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఏ సీఎం కూడా ప్రతిపక్ష నాయకుడి ఇంటికి వెళ్లి పలుమార్లు ఆహ్వానించడం చూడలేదన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని, కాంగ్రెస్ పార్టీ ముఖ్యమని స్పష్టం చేశారు.

దివ్యాంగులను హింసిస్తే కఠిన చర్యలు

- జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

పర్లాకిమిడి: దివ్యాంగులను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి హాల్‌లో దివ్యాంగుల చట్టాలపై అవగాహన సదస్సు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల చట్టం 2016పై అవగాహన కోసం ఈ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే చాప్టర్ 16లో పొందుపరిచిన విధంగా దివ్యాంగులను హింసించడం వంటి కేసుల్లో పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లో పొందుపరచలేకపోతే అది ట్రయల్ కోర్టుకు కేసు వెళ్లలేదు అన్నారు. దీనిపై సమర్థ్ దివ్యాంగుల సంస్థ కార్యదర్శి సంతోష్ మహారాణా మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం 2016 అమలుకు పెద్దలందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో స్టేక్ హోల్డర్స్‌తో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కమిషన్ అధ్యక్షురాలు బ్రోతోతి హరిచందన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, అదనపు జిల్లా మాజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ కార్య నిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్, న్యాయవాది పంకజ్ సిన్హా, సెంటర్ ఫర్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ కార్యదర్శి ఎ.జగన్నాథరాజు, రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిరంజన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు అవశేషాలు స్వాధీనం


పాతిపెట్టిన ఏనుగు అవశేషాలను తవ్వితీస్తున్న దృశ్యం

రాయగడ: పాతిపెట్టిన ఏనుగు అవశేషాలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కల్యాణసింగుపూర్ అటవీ శాఖ పరిధి ఖిదాపడ పంచాయతీలోని కిర్కింండ అడవుల్లో పాతిపెట్టిన ఏనుగు అవశేషాలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లా అటవీ శాఖ అధికారి అన్నమలై సచిన్ ఓలే నేతృత్వంలో నలుగురు పశువైద్యులతో పాటు మాజిస్ట్రేట్ సమక్షంలో సోమవారం తవ్వకాలు చేపట్టారు. ఏనుగు దంతాలను దొంగిలించి ఏనుగును హత్య చేసిన అనంతరం పాతిపెట్టిన విషయం గత మార్చి 10వ తేదీన చోటుచేసుకుంది. ఈ మేరకు అటవీ శాఖ సిబ్బంది గత కొద్ది రోజులుగా ఏనుగును పాతిపెట్టిన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో కిర్కింండ అడవుల్లో గుర్తించారు. ఇదిలా ఉండగా ఏనుగు దంతాల అక్రమ రవాణా కేసుకు సంబంధించి కల్యాణసింగుపూర్ గ్రామానికి చెందిన సురేంద్ర నాహక, ప్రధానిగుడ గ్రామానికి చెందిన శంకర్ కొండగిరిని అధికారులు అప్పట్లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నిందితులను దర్యాప్తు చేసిన అధికారులు ఈ మేరకు ఏనుగును పాతిపెట్టిన స్థలాన్ని గుర్తించగలిగారు.

28 నుంచి ఆల్ ఇండియా డ్యాన్స్ ఆన్‌లైన్ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ (విశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఆల్ ఇండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీ లను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని సంప్రదాయాల నృత్య కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో 'దేశభక్తి' అంశంతో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యాలలో డ్యూయట్ గ్రూపు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జూనియర్స్, సీనియర్స్ బృంద విభాగంలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు ట్రోఫీతో పాటు అందిస్తామన్నారు. ఈ పోటీ ల్లో 10 నుంచి 15ఏళ్ల లోపు వారు జూనియర్స్‌గా, 16ఏళ్లు పైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు.

వరదలపై అప్రమత్తత అవసరం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఒడిశాలో భారీగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి నాగావళి, వంశధార నదులకు వచ్చి చేరుతున్న వరద నీటిపై ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి సోమవారం సాయంత్రం ఆయన జిల్లాలోని పలు ముఖ్య శాఖల అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాతో పాటు ఒడిశా రాష్ట్రంలో మన జిల్లాలో ప్రవహించే నదుల క్యాచ్‌మెంటు ప్రాంతాల్లో భారీగా వానలు కురుస్తున్నాయని, వర్షాలతో నదీ ప్రవాహం ప్రమాద స్థాయిని దాటితే గొట్టా వద్ద గేట్లను ఎత్తడానికి తగిన ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను, అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రధాన నదుల వరద నీటిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై మాట్లాడుతూ ఎల్ఎన్ పేట తురకలకోట వద్ద కాజ్ వే దెబ్బతిన్న కారణంగా వంశధార నీరు 150 ఎకరాల్లో పంటను ముంచెత్తిందని, దీనిపై స్థానిక తహసీల్దార్‌తో కలసి వ్యవసాయ, వంశధార శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్‌కు సూచించారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌ఓ మీనాక్షిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన వన శాఖ, జిల్లా అటవీ శాఖల అధికారులతో తాజా పరిస్థితిని గురించి అడిగారు.

‘నడక’యాతన


రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న ప్రజలు


జగన్నాథపూర్ పంచాయతీకి వెళ్లే రహదారి దుస్థితి

కొరాపుట్: వర్షాలు వలన నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి జగన్నాథపూర్ గ్రామ పంచాయతీ లౌగుడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారిపై బురద పేరుకుపోయి ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారు. కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వినూత్న నిరసన

కొరాపుట్ జిల్లా సునాబెడా మున్సిపాలిటీ పరిధి సిమిలిగుడలోని ఇందిరానగర్‌లో రోడ్డుపై ప్రజలు వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలో రోడ్లు గుంతలు పడి వర్షం వలన చెరువులా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువలన అధికారులు స్పందించాలని కోరుతూ గోతుల్లో చేప పిల్లలు వదలి, మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు.

కారు డ్రైవర్‌కు 9 నెలలు జైలు శిక్ష

నరసన్నపేట: నిర్లక్ష్యంగా కారు నడిపి 45 రోజుల బాలుడి మృతికి కారణమైన కారు డ్రైవర్ రౌతు రమణమూర్తికి 9 నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ సోమవారం తీర్పు నిచ్చారు. మండల పరిధిలోని ఆర్అండ్‌బీ రహ దారి పై కోమర్తి–లింగాలపాడుల మధ్య 2022 అక్టోబర్ నెల 7వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై ఈ విధంగా తీర్పు నిచ్చారు. ఉర్లాం పీహెచ్‌సీకి వ్యాక్సినేషన్ కోసం బాలుడిని తీసుకువెళ్లి తిరిగి కోమర్తిలోని ఇంటికి తీసుకువస్తుండగా.. విశాఖ పట్నం మల్కాపురానికి చెందిన రైతు రమణమూర్తి ఏపీ 39 కెఏ6617 నంబరు గల కారుతో ఆటోను బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో 45 రోజుల బాలుడు మృతి చెందగా మరో వ్యక్తికి చేయి విరిగింది. ఈ ప్రమాదంపై సింహాద్రి సారిమల్లా (బాలు డి తల్లి) నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం కారు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా గుర్తించి జడ్జి సి.హరిప్రియ ఈ మేరకు తీర్పు నిచ్చారు.

స్థల వివాదంలో వ్యక్తికి జైలు శిక్ష

నందిగాం: మండలంలోని బోరుభద్రలో 2018లో జరిగిన స్థల వివాదంలో ఇప్పిలి ఢిల్లేశ్వరరావు అనే వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించా రని నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోరుభద్రకు చెందిన ఇప్పిలి అప్పలస్వామి, పోలమ్మ దంపతులపై ఆదే గ్రామానికి చెందిన ఇప్పిలి ఢిల్లేశ్వరరావు, ఇప్పిలి లచ్చమ్మ, బొమ్మాళి హరి, బొమ్మాళి అప్పలస్వామి, బొమ్మాళి సాయమ్మ, బొమ్మాళి కమలమ్మ, బొమ్మాళి లచ్చులు గ్రామంలో ఒక స్థల వివాదంలో గొడవపడ్డారు. అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

సోమవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.హరిప్రియ వాదనలు విన్న టె క్కలి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్‌హెచ్ఆర్ చక్రవర్తి ఢిల్లేశ్వరరావుకు జైలు శిక్ష, రూ.1000 జరిమానా, మిగిలిన వారికి రూ. 1000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



గాయపడిన ఆటో డ్రైవర్

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి26పై సోమవారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న పుసపాటిరేగ చెందిన ఆటోను అదే మార్గంలో వెళ్తున్న కాంక్రీట్ మిక్సింగ్ లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురు ప్రయాణిలు ఉన్నారు. ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ కె.సూరికి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతురాలు వరహాలమ్మ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన కోడూరు వరహాలమ్మ(74) మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరహాలమ్మకు ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉన్నారని, ఏడాదిన్నరగా ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో బాగోగులు చూసుకునే వారు కరువయ్యారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం గడ్డి మందు తాగేసినట్లు చెప్పారు. తొలుత వీరఘట్టం పీహెచ్‌సీ, పాలకొండ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఆమె కుమారుడు ధనుంజయనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్సు, లారీ ఢీ: పలువురికి గాయాలు



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కొమరాడ: కూనేరు నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సును పార్వతీపురం నుంచి రాయిగడ వెళ్తున్న లారీ సోమవారం గుమడ సమీపంలో ఢీకొంది. దీంతో జరిగిన ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై నీలకంఠ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పరామర్శ కోసం చోళ్లపదం వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా లారీ ఢీకట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరిశర్ల అప్పలనాయుడు తలకు, మరిశర్ల సంజీవ కుమార్ కుడిచేతికి గాయాలు కాగా మరికొందరికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే క్షతగ్రాతులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆధార్' కోసం ఆశ్రయించవద్దు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఆధార్ కార్డులో సవరణలు వయస్సు మార్పుచేర్పులు చేస్తామంటూ ప్రజలను మధ్యపెట్టేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆధార్‌లో మార్పులు, సవరణలు చేస్తామంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందని అటువంటి వాటిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన కేంద్రాలు మినహా మరెక్కడా ఆధార్‌లో మార్పులు, సవరణలు చేసేందుకు అవకాశం లేదని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని, తప్పుడు ప్రకటనలకు మోసపోవద్దని కోరారు. అటువంటి వారిని ఆశ్రయించవద్దని సూచించారు. జిల్లాలో తాగునీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేయాలని తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు. వాటి నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నదీ లేనిదీ అదే విధంగా వాటిలో సరైన ప్రమాణాలు పాటిస్తున్నదీ లేనిదీ తనిఖీ చేసి నివేదించాలని ఆదేశించారు.

గడువులోగా వినతుల పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: అధికారులు ఏ రోజు వినతులు ఆ రోజే చూడాలని నాట్ వ్యూ ఉండకూడదని అలాగే వచ్చిన వాటిని గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 149 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అధికారులు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పంపాలని ఆన్‌లైన్‌లో ఏ స్టేజ్ లోనూ పెండింగ్ కనపడకూడదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత వినతులు స్వీకరించారు.

ఎస్పీకి 29 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 29 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్పీ సీఐలు కేకేవీ .విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి: డీఆర్‌ఓ

పార్వతీపురం: ప్రభుత్వ భూములు, తోటపల్లి నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో అక్రమణలను తక్షణమే తొలగించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ కేశవనాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన 69 అర్జీలపై సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు అందినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ప్రజాసమస్యల పరిష్కార వెవేదిక వెలవెల

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వెలవెల బోయింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులు ఇవ్వడానికి ఎవరూ రాకపోవడంతో కార్యక్రమంలో అధికారులు మాత్రమే మిగిలారు. 12.30గంటల తర్వాత వివిధ సమస్యలపై 35 వరకు వినతులు వచ్చాయి. గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నారాయుడు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న డీర్‌ఓ కేశవ నాయుడు



పార్వతీపురం టౌన్: బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి



సీతంపేట: వెలవెలబోతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

- జిల్లా బ్రాహ్మణ సంక్షేమసేవా సంఘం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్

విజయనగరం టౌన్: నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషిచేస్తామని జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు టీవీ.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యాసపూర్ణిమనుపురస్కరించుకుని బ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేస్తున్న పలువురు వేదపండితులను సంఘం తరపున సత్కరించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. జిల్లాలోని నిరుపేద బ్రాహ్మణులకు అండగా సంఘం తరపున తామందరం ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు వేదపండితులు, ప్రవచన కర్తల దంపతులను వస్త్రాలు, శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కట్టమూరి చంద్రశేఖర శర్మ, భమిడిపాటి రామ్‌కుమార్, కూరెళ్ల సరోజిని, సత్యనారాయణ, సరిపల్లి శ్రీనివాస్, రాపాక చంద్రశేఖర్, ఈశ్వర సోమయాజులు (రాంజీ), కందాల సాయిబాబా, యామిజాల, పప్పు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌ను పరిశీలించిన డీఈఓ



శిక్షా సప్తాహ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

సాలూరు: అన్ని పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని డీఈఓ పగడాలమ్మ పరిశీలించారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. స్థానిక వనరులతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో తయారుచేయించిన బోధనా అభ్యసనా సామగ్రిను సందర్శించారు. విద్యార్థులను ప్రోత్సహించి, లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం పాల్గొన్నారు.

కానరాని ఈ-క్రాప్ నమోదు

- ప్రారంభం కాని కార్యక్రమం
- ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులైనా కదలని యంత్రాంగం
- ప్రభుత్వం నుంచి రాని స్పష్టత



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

పార్వతీపురం: గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడు మూతలాడుతుండడంతో సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. పార్వతీపరరం మన్యం జిల్లాలో గత ఏడాది 15 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 1.77 లక్షల ఎకరాలలో ఈ-క్రాప్ నమోదు చేశారు. అదే విధంగా రబీలో 45వేల ఎకరాలలో ఈ- క్రాప్ నమోదు చేశారు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 1.75 ఎకరాల్లో పంట సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయగా ఇంతవరకు 40 శాతం వరకు వరి ఉబాలు నిర్వహించారు. గింజ విత్తినప్పటి నుంచి కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలా మేలు చేసేందుకు ఈ-క్రాప్ విధానం తోడ్పాటు అందించేది.

గత ప్రభుత్వంలో అమలైంది ఇలా..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామ స్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ-క్రాప్ విధానాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్బీకేలలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్ ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ-క్రాప్ విధానం అమలులో ఉండడం వల్ల రైతు సాగు చేసే పంట వివరాలు వ్యవసాయ శాఖలో నమోదయ్యేవి. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్బీకేలలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లలో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించే అవకాశం ఉండేది. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతుల్లో సాగు పట్ల ధీమా కలిగించేది. పండితే పంట.. లేకుంటే బీమా వస్తుండడంతో రైతన్నలు సాగు చేయడానికి సన్నద్ధంగా ఉండేవారు. ఈ-క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు పండించిన ఉత్పత్తులను ఎప్పుడైనా తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది.

'అమలు చేయకపోతే అన్నదాతకు కష్టాలు

వరి సాగు చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయశాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంట సాగు వివరాలు తెలియకపోవడంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు ఆ రైతులకు అవసరమైన వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతోంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ పొందే హక్కు రైతులు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు కోల్పోతారు. ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు కాకపోవడం వల్ల అనర్హులకు ప్రభుత్వ రాయితీలు దక్కే ప్రమాదముంది. పలు రకాల పంటలు సాగు చేసే రైతుల సమగ్ర వివరాలు గుర్తించే అవకాశం లేకుండా పోవడంతో అవినీతి జరిగే అవకాశం మెండుగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


తీవ్రంగా నష్టపోతాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగించి రైతులను ఆదుకోవాలి.

-ఎం.శ్రీనివాసరావు, రైతు, పెద్దూరు గ్రామం

పంట వేసిన తరువాతే ఈ-క్రాప్ నమోదు



రైతులు పొలంలో పంట వేసిన తరువాతే ఈ-క్రాప్‌ను నమోదు చేస్తాం. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆదేశాలు అందలేదు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం ప్రకారం ప్రతి రైతుకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బందితో కలిసి ఈ క్రాప్ నమోదు చేస్తాం.

-కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాధ్
- సాలూరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- కలెక్టర్‌కు స్వీకరించిన 287 వినతులు



వినతులు తీసుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సాలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యల పట్ల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అలాగే అధికారులు ప్రతి మంగళవారం, శుక్రవారం క్షేత్రస్థాయి సందర్శన చేయాలని కోరారు. భారీ వర్షాలకు రోడ్లు మరమ్మతులకు గురై ఉంటాయని వాటిని పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ అధికారులకు కోరారు. అలాగే వార్తాపత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు 100 రోజుల కార్యాచరణ రూపొందించాలని, ప్రతినెల రెండు బ్లడ్ క్యాంపులు న్విహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వచ్చిన 287 వినతులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సంయుక్తకలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఆర్‌డీఓ కె.హేమలత స్వీకరించారు. ముఖ్యంగా భూసమస్యలపై అర్జీలు అధికంగా వచ్చాయి.

ప్రోటోకాల్ పాటించాలి

ప్రోటోకాల్ పాటించాలంటూ వైఎస్సార్‌సీపీ కొట్టుపరువు సర్పంచ్ కొండతామర నరసింహులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ప్రజాప్రతినిధుల విషయంలో మండల అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ



లబ్ధిదారులతో జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (విశాఖపట్నం) ఆర్థిక సౌజన్యంతో జిల్లాలోని విభిన్నప్రతిభావంతులకు వివిధ సహాయ ఉపకరణాలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ 26 మంది దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మూడుచక్రాల వాహనాలను అందజేశారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు గత ఏడాది నవంబర్ 18న స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన శిబిరంలో లబ్ధిదారుల జాబితా ఎంపికచేశామని విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా ఎ.డి జీవీబీ జగదీష్ తెలియజేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు కె.దిలీప్‌కుమార్, సత్యనారాయణ, ఆలిమ్ కో ప్రతినిధులు డి.శివకుమార్, జనార్దన సాహు తదితరులు పాల్గొన్నారు.

ట్రీమాన్ సినిమా సందడి



మూవీ షూటింగ్ సందడి



చిత్రీకరణలో భాగం

పాచిపెంట: మండలంలోని పద్మాపురం సమీపంలో 'ట్రీమాన్' అనే సినిమా చిత్రీకరణ జరుగుతోంది. గిరిజన ఆచార సంప్రదాయాలు చూపించే విధంగా ఈ సినిమా రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ రాజు తెలిపారు.కాగా సినిమా చిత్రీకరణ హడావుడితో పద్మాపురం పరిసర ప్రాంతాల గిరిజనులు, ప్రజలు షూటింగ్ స్థలానికి చేరుకున్నారు. చిత్రీకరణ తీరును చూస్తూ ఇంతవరకు సినిమాలు చూడడమే తప్ప, ఎలా తీస్తారో ఇప్పుడే చూస్తున్నామంటూ మాట్లాడుకున్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు

- మానవత్వం చాటుకున్న స్వచ్ఛంద సంస్థలు



అనాథ మహిళకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

చీపురుపల్లి: ఎక్కడో పుట్టి..ఎక్కడెక్కడో పెరిగి..కొద్దిరోజులుగా చీపురుపల్లి పట్టణంలో రోడ్ల పక్కనే ఉంటున్న ఓ మహిళ అకస్మాత్తుగా మరణించింది. ఆమెకంటూ ఎవరూ లేకపోయినా.. అనాథగానే మరణించినప్పటికీ అంత్యక్రియలు మాత్రం అందరూ ఉన్నట్లు గానే సంప్రదాయ పద్ధతిలో జరిగాయి. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా చీపురుపల్లి పట్టణంలో అనాథగా తిరుగుతున్న ఓ మహిళ లావేరురోడ్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో గల బస్‌షెల్టర్‌లో సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్, మానవీయత స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందించారు. దీంతో తక్షణమే స్పందించిన ఆ సంస్థల అధ్యక్షులు రెడ్డి రమణ, బీవీ.గోవిందరాజులుతో పాటు మానవతా వాదులు కోట్ల పైడిరాజు, తాడ్డి సీతాలక్ష్మి, కనకరత్నం అక్కడికి చేరుకుని మృతి చెందిన అనాథ మహిళను గుర్తించారు. దీంతో మార్చురీ వాహన నిర్వాహకుడు బత్తుల నారాయణను సహాయం కోరగా ఆయన ఉచితంగానే వాహనం తీసుకొచ్చాడు. అనంతరం వారంతా కలిసి మృతదేహానికి స్నానం చేయించి అప్పటికే కొనుగోలు చేసిన చీరలు, పూలదండలు మృతదేహంపై వేశారు. అక్కడి నుంచి వాహనంలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పౌరవేదిక వినతి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న పౌరవేదిక ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాకేంద్రంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్)లో పనిచేస్తున్న జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ)ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్)ల 43 కుటుంబాలను మీ నిర్లక్ష్యంతో రోడ్డున పడేశారని, సంవత్సరం కాలంగా వారి చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారికి ప్రతి నెలా ఎందుకు జీతాలు ఇవ్వలేదో అధికారులు వెంటనే తెలియచేయాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెండ్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడిని నిలదీశారు. ఈ మేరకు సోమవారం ఆయన పౌర వేదిక ప్రతినిధుల బృందంతో కలిసి డాక్టర్ అప్పలనాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 జూలై నెలనుంచి 43 మంది నిర్విరామంగా జిల్లా కేంద్రాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తుంటే వారికి జీతాలు సమయానికి అందించాలనే ఆలోచన అధికారులకు లేకపోవడం విచిత్రంగా ఉందని, పని చేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులు, పిల్లలు ఎలా జీవిస్తారని ఆవేదన వ్యక్తంచేశారు, వారి సమస్యలు చెప్పుకుం దామనుకుంటే అధికారులు కనీసం సమయం ఇవ్వకపోవడమే కాకుండా హేళనగా మాట్లాడుతూ వారి మనోభావాలు దెబ్బె తీస్తున్నారని,25 మందిలో 11 మంది మహిళలు ఉద్యోగం చేస్తున్నారని వారి ఆవేదన అర్థం చేసుకునే పరిస్థితిలో ఆసుపత్రి అధికారులు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన రాఖీ పుష్పాలు



విరబూసిన రాఖీ పుష్పాలు

పాలకొండ రూరల్: అన్నా చెల్లెళ్ల అనురాగానికి, అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండగ మరికొద్ది రోజుల్లో రానుంది. ఈ నేపథ్యంలో పాలకొండ పట్టణంలోని బుట్టిమఠం సమీపంలో ఉన్న అర్చకుడు గాసీదాసు గృహంలో విరి సిన రాఖీ పుష్పాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ పూలతో ప్రస్తుతం బుట్టిమఠం ఆలయంలో కొలువైన భీమలింగేశ్వరుని అలంకరిస్తున్నట్లు అర్చకుడు, అక్కడి వారు పేర్కొంటున్నారు.